బీఆర్ఎస్‌ను మోసం చేసిన శ్రీహరి

- అధినేత కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన కడియం
- బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు నర్సింగం

జనగామ, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి పార్టీకి ద్రోహం చేశారని, నమ్మిన అధినేత కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కారు గుర్తుపై కడియం శ్రీహరిని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు గెలిపిస్తే మోసం చేశారన్నారు. శ్రీహరి వెళ్లినంత మాత్రాన పార్టీకి నష్టం ఏమీలేదని, కేసీఆర్‌కు అండగా నిలబడుతామన్నారు. పది సంవత్సరాల్లోఎంపీగా, ఎమ్మెల్సీగా, నాలుగేళ్లు ఉప ముఖ్యమంత్రిగా కడియం శ్రీహరికి అధినేత అవకాశాలిచ్చారని తెలిపారు. శ్రీహరి కూతురు కావ్యకు వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తే పార్టీకి తీరని ద్రోహం చేశాడని ఆరోపించారు. తన రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలో శ్రీహరి చేరడం నీచమైన చర్యగా అభివర్ణించారు. తనది నలభై ఏండ్ల రాజకీయ చరిత్ర అని చెప్పుకునే కడియం ఏ పార్టీ అధికారంలో ఉంటే అజెండా కప్పు కోవడమేనా అని నర్సింగం ప్రశ్నించారు. కుట్రలు చేసి ప్రజల కోసం పోరాటం చేసే కమ్యూనిస్టులను అణిచి వేసి ఎన్‌కౌంటర్ల పేరుతో అనేక మంది అమాయకులను, నక్సలైట్లను పొట్టన పెట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్‌లో అనేక పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ మారడం అనైతిక తప్ప మరోటి కాదన్నారు. పార్టీని, కేసీఆర్ ను మోసం చేసిన మీకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజకీయ ప్రస్థానం ముగిసినట్లేనని ఆయన స్పష్టం చేశారు.

పార్టీ నుంచి స్క్రాప్ పోతుంది : సందీప్

బీఆర్ఎస్ నుంచి చెత్తంతా పోతున్నదని, చివరికి బలమైన వాళ్లే మిగులుతారని బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షులు ఉల్లెంగుల సందీప్ అన్నారు. నాయకులను కొందరు కొంటారు.. కానీ కార్యకర్తలను కొనలేరని, తొలి నుంచి గులాబీ జెండా మోసిన నాయకులే పార్టీలో ఉన్నారన్నారు. పదవులు, వ్యాపారాల కోసం వచ్చిన వారే పార్టీ మారుతున్నారని, ఒకరిద్దరు పోయినంతా మాత్రాన పార్టీకి నష్టంలేదన్నారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నిందితుడిని చూపుతున్న పోలీసులు

బచ్చన్నపేట, మార్చి 29 : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం కనిపించింది. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడేనికి చెందిన భూక్యా రమేశ్ 14క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు నిందితుడు రమేశ్ ఒప్పుకోవడంతో అతడిని ఠాణాకు పంపి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం రేషన్ బియ్యం సరఫరా చేస్తుంటే కొందరు అక్రమంగా కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆలయాల అభివృద్ధి కమిటీ కార్యవర్గం

ఆలయాల అభివృద్ధి కమిటీ ఎన్నిక

జఫర్‌గఢ్, మార్చి 29 : మండల కేంద్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం నూతన కమిటీని స్థానికులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రామాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆలయాల అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యాచరణపై తీర్మానం చేశారు. ఆలయాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా మంచాల ఎల్లయ్య, గౌరవాధ్యక్షుడిగా అన్నెబోయిన భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా తాటికాయల యాకయ్య, కోశాధికారిగా అంచూరి యుగేందర్, సలహాదారులుగా ఈరబత్తిని అంజయ్య, సభ్యులుగా సోమ శేఖర్, విజయ్‌గౌడ్, రాజేందర్, యాదగిరి, యాకయ్య, రాజు, రమేశ్, నర్సింగం, సోమేశ్వర్, ఎల్లయ్య, రమేశ్, రంజిత్‌సింగ్ ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య మాట్లాడుతూ స్థానిక శివాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనకు కృషి చేస్తామన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లోని హైవేపై కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జఫర్‌గఢ్ : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కడియంపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

- ఎమ్మెల్యే పదవికి శ్రీహరి రాజీనామా చేయాలని డిమాండ్
- నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం దిష్టిబొమ్మ దహనం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 29 : బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి రాజకీయ అవకాశవాదని పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ముందు ఎమ్మెల్యే పదవికి కడియం శ్రీహరి రాజీనామా చేసి ఏ పార్టీలో చేరినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశాయి. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మండల కేంద్రంలోని హైవేపై నిరసన తెలిపి శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి కడియం శ్రీహరిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారని గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికలు రావడంతో తన కూతురు కోసం కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని విమర్శించారు. ముందుగా కడియం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని గణేశ్ డిమాండ్ చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న నాయకుడని నియోజకవర్గ ప్రజలు నమ్మితే మోసం చేశారని ఆరోపించారు. తన రాజకీయ అవసరాల కోసం కాంగ్రెస్‌లో చేరాలని భావించడం సరి కాదన్నారు. ముందు కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఏ పార్టీలో చేరినా తమకు అభ్యంతరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పొన్న రంజిత్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి, తిరుమల నాథ స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ కుంభం కుమార్, మీదికొండ గ్రామ అధ్యక్షుడు గొడుగు సంజీవ, ఆకారపు అశోక్, జోగు రాజు, జోగు కిష్టయ్య, శవశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి 'కడియం' రాజీనామా చేయాలి...

జఫర్‌గఢ్ : అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆ తర్వాతే వేరే పార్టీలో చేరాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లెపాటి జయపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకోవడం సిగ్గు చేటన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఎంతో నమ్మకంతో కడియం శ్రీహరికి డిప్యూటీ సీఎంగా, రాష్ట్ర మంత్రిగా, పార్టీ నాయకుడిగా అవకాశాలు కల్పించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్‌లో పదవులన్నీ అనుభవించిన కడియం శ్రీహరి తన రాజకీయ స్వార్థం కోసం రాజకీయాలు చేస్తున్నారని జయపాల్‌రెడ్డి విమర్శించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, ఉద్యమకారులు ఎంతగానో కష్టపడి కడియం శ్రీహరిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మోసం చేశారని జయపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కడియం శ్రీహరి ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. లేకుంటే పార్టీ శ్రేణుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మరిజె నర్సింహారావు

ఎమ్మెల్యే కడియం రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ వేలేరు మండల నాయకులు

వేలేరు, మార్చి 29 : ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన పదవికి రాజీనామా చేసి వేరే పార్టీలో చేరాలని వేలేరు మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వేలేరులో ఎంపీటీసీ ఇట్టబోయిన సంధ్య నివాసంలో మండలాధ్యక్షుడు మరిజె నర్సింహారావు, జడ్పీటీసీ చాడ సరితా రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కడియం శ్రీహరికి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆయన కూతురు కావ్యకి వరంగల్ లోక్‌సభ టికెట్‌ను కేటాయించారని పేర్కొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజయ్యను కాదని, కడియంకు టికెట్ ఇచ్చి గెలిపిస్తే ఇప్పుడు పార్టీకి ద్రోహం చేసి తన స్వార్థ ప్రయోజనాల కోసం వేరే పార్టీలో చేరడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, ఎంపీటీసీ బత్తుల జ్యోతి, కో ఆప్షన్ మెంబర్ జానీ, నాయకులు మహేందర్, భూపతిరాజ్, ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, స్వరూప పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

గార్ల, మార్చి 29: టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని పీడీఎస్ మండల కార్యదర్శి మహేశ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో టెట్ పేపర్ -1 ఫీజు రూ.200, పేపర్ -2కు రూ.200 మొత్తం రూ.400 ఫీజు ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా పెంచిందన్నారు. అభ్యర్థులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ తక్షణమే టెట్ ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ నాయకులు పవన్, సతీశ్, ప్రసాద్, సతీశ్ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తోటపల్లి విజయ్

పటిష్టంగా దేశ ఆర్థిక వ్యవస్థ : సీఏ విజయ్

వరంగల్, మార్చి 29 : ఇతర దేశాల కంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని సీఏ తోటపల్లి విజయ్ అన్నారు. శుక్రవారం హంటర్ రోడ్డులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సీఏ భగవాన్‌దాస్ ముందాడ అధ్యక్షతన ఆడిట్‌పై జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ ధృడంగా ఉండడం వల్లే బ్యాంకింగ్ రంగం ఒడిదుడుకులు లేకుండా సాగుతున్నదన్నారు. వరంగల్ ఐసీఏఐ చైర్మన్ భగవాన్‌దాస్ మాట్లాడుతూ.. సీఏలు ఆడిటింగ్‌ను బాధ్యతగా నిర్వహిస్తున్నారన్నారు. సదస్సులో చార్టర్డ్ అకౌంటెంట్స్ మాదారపు సుజిత్, రాయబారపు హరి కృష్ణ, తోట కరుణాకర్, చంచల్ అగర్వాల్, రాజేశ్ బజాజ్, వంశీకృష్ణ, పరమేశ్, భరత్ పాల్గొన్నారు.

రిజర్వాయర్ల పనుల్లో వేగం పెంచాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

చెన్నూరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పాలకుర్తి రూరల్, మార్చి 29: పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నూరు రిజర్వాయర్ పనులను ఆమె స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యశస్వినీ రెడ్డి మాట్లాడుతూ రిజర్వాయర్ల పనులను రెండేళ్లలో పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యత లేకుండా పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అత్తా, కొడళ్ల మధ్య విభేదాలు అని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. నియోజక వర్గ అభివృద్ధే తమ ధ్యేయమని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, కారుపోతుల శ్రీనివాస్, జలగం కుమార్, బండిపెల్లి మణెమ్మ, బైర్ భార్గవ్, పసులాది వెంకటేశ్, గాదేపాక భాస్కర్, మునావత్ హరి, బొమ్మగాని భాస్కర్, గుగ్గిళ్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

గద్దర్ కళాక్షేత్రం ఏర్పాటుకు కృషి..

పాలకుర్తి, మార్చి 29: హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో గద్దర్ కళాక్షేత్రం ఏర్పాటుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాస్వామిక తెలంగాణ గద్దర్ ఆలోచన ఐక్యవేదికకు చెందిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఆనంతరం ఐక్య వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు మొలుగూరి యాకయ్యగౌడ్, మండల కన్వీనర్ నారగోని ఎల్లయ్యగౌడ్ మాట్లాడుతూ గద్దర్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకంలో చేర్చాలని కోరారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, కాంగ్రెస్ మండల కార్యదర్శి బైరు భార్గవ్ పాల్గొన్నారు.

జోరుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు

కమలాపూర్, మార్చి 29 : మండలంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా కొనసాగుతున్నాయి. ఆయా జట్ల గెలుపు, ఓటములపై యువకులు లక్షల రూపాయల్లో బెట్టింగ్ పెడుతున్నారు. కమలాపూర్, ఉప్పల్, భీంపల్లి, శనిగరం, మర్రిపల్లిగూడెం, గూడూరు, అంబాల తదితర గ్రామాల్లోని యువకులు రాత్రి 12గంటల వరకు సెల్‌ఫోన్‌లోనే బెట్టింగ్‌లు చేస్తున్నారు. కొందరు యువకులు బ్రోకర్లుగా మారి క్రికెట్ బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు చెల్లింపులు చేస్తున్నారు. ఇలా రోజూ లక్షల రూపాయల బెట్టింగ్ చేస్తూ కొందరు యువకులు డబ్బులు పోగొట్టుకుంటున్నట్లు తెలిసింది. క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసులు దృష్టిసారించి, బ్రోకర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్షర్లు మూసివేయాలని రైతుల నిరసన

శాయంపేట, మార్చి 29 : మండలంలోని మాందారిపేట శివారులోని ఈఆర్ఆర్, మరో క్రషర్‌ను మూసివేయాలని గోవిందపూర్ గ్రామ రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. క్రషర్‌కి వెళ్లే దారిలో గడ్డితో మంట పెట్టారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి క్రషర్లు మూసేయాలని నినాదాలు చేశారు. క్రషర్ల నుంచి వస్తున్న దుమ్ము పడి పంటలు దెబ్బతిని నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. అలాగే తమ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. న్యాయం చేయాలని కోరారు.

డీజే బాక్స్ పడి బాలుడి మృతి

కురవి(సీరోలు), మార్చి 29 : సీరోలు మండలం బూర్గుచెట్టుతండా జీపీ పరిధిలోని పీక్లా తండాలో శుక్రవారం పెళ్లి వేడుకలో విషాదం జరిగింది. డీజే సౌండ్ బాక్సులు పడి బానోత్ మనోజ్(14) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. బానోత్ శ్రీను చిన్నకుమారుడు మనోజ్ తండాలో జరుగుతున్న పెళ్లికి వెళ్తున్నాడు. అదే సమయంలో మాలోత్ సాయి డీజే బాక్సులు తీసుకొని వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు డీజే బాక్సులు మనోజ్‌పై మీద పడి మృతి చెందాడు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై విజయ రామ్‌కుమార్ తెలిపారు.

తోపులాటలో ఒకరు మృతి : నలుగురిపై కేసు నమోదు

భద్రు మృతదేహం

గూడూరు, మార్చి 29 : ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో ఒకరు మృతిచెందిన ఘటన గూడూరు మండలం గుండెంగ గ్రామ పరిధి తేజావత్ ధంజ్యాతండాలో శుక్రవారం జరిగింది. ఎస్సై నగేశ్ కథనం ప్రకారం... ధంజ్యాతండాకు చెందిన తేజావత్ భద్రు(45) కుమారుడు లక్ష్మణ్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ నెల 3న లక్ష్మణ్ హైదరాబాద్‌లో మృతిచెందాడు. ఇదే తండాలో ఒకే కుటుంబానికి చెందిన నవీన్, అమ్మి, రేణుక, సునీత కూడా హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. వీరు ఇటీవల తండాకు వచ్చారు. కాగా, లక్ష్మణ్ మృతికి నవీన్ కుటుంబ సభ్యులే కారణమని భద్రు, నవీన్ కుటుంబ సభ్యులకు తండాలో శుక్రవారం గొడవ జరిగింది. ఈ గొడవలో ఒకరినొకరు తోసుకోగా, తేజావత్ భద్రు కిందపడిపోయి స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు నర్సంపేటకు తరలిస్తుండగా మృతి చెందాడు. అతడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న బీజేపీ'

మహబూబాబాద్ రూరల్, మార్చి 29 : దేశంలో కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అవినీతిని వెలికితీస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ దానిని చట్టబద్ధం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాదుల శ్రీనివాస్, ఆకుల రాజు, వీరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

తొర్రూరు, మార్చి29 : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని తాగునీటి బావిని సందర్శించి, నీటి సరఫరా ప్రణాళికను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలన్నారు. లీకేజీలను అరికట్టాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఎన్డీఎఫ్ నిధులను ఖర్చు చేయాలని చెప్పారు. తాగునీటి సమస్యపై ఎవరు ఫోన్ చేసినా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు.

జనగామ ఏసీపీగా కే పార్థసారథి

బాధ్యతలు స్వీకరిస్తున్న పార్థసారథి

జనగామ చౌరస్తా, మార్చి 29 : జనగామ ఏసీపీగా కే పార్థసారథి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వరంగల్ కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఆయన విధులు నిర్వర్తించారు. మొన్నటిదాకా ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వర్తించిన దామోదర్‌రెడ్డిపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేయడంతో ఆయనను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. తాజాగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా ఆదేశాల మేరకు జనగామ ఏసీపీగా పార్థసారథి విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆయన సీపీ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

చిల్పూరు, మార్చి 29 : రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు ఈ నెల 30(నేడు)న మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం రమేశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని ఆయన కోరారు. దళారుల మాటలను నమ్మొద్దని, ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు.

నేడు జనగామలో రన్ ఫర్ జీసస్

జనగామ చౌరస్తా, మార్చి 29 : జిల్లా కేంద్రంలో శనివారం 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారొక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తాలోని ఉన్నపుర సెంటినరీ బాప్టిస్ట్ చర్చి నుంచి నెహ్రూపార్కు, రైల్వేస్టేషన్, కూరగాయల మార్కెట్, ధర్మకంచ, సంజయ్‌నగర్, అంబేద్కర్‌నగర్, దయానిలయం మీదుగా ఉన్నపుర చర్చి వరకు రన్ ఫర్ జీసస్ కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. పట్టణంలోని క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలోఒకరికి తీవ్రగాయాలు

వర్ధన్నపేట, మార్చి 29: ఆకేరువాగు బ్రిడ్జిపై బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం జరిగింది. ఇల్లంద గ్రామానికి చెందిన గడ్డల వెంకటస్వామి వర్ధన్నపేటలో వ్యక్తిగత పనికోసం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో తన బైక్ అదుపుతప్పి ఆకేరువాగు బ్రిడ్జిపై పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలు కాగా అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే ఇతర వాహనదారులు 108, పోలీసులకు సమాచారం ఇచ్చి దవాఖానకు తరలించారు.

జనగామలోని ఉన్నపుర చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

స్టేషన్‌ఘన్‌పూర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా 'గుడ్ ఫ్రైడే' వేడుకలు

యేసును స్మరిస్తూ క్రైస్తవుల ప్రార్థనలు

జనగామ చౌరస్తా/స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి, మార్చి 29 : 'గుడ్ ఫ్రైడే'ను పురస్కరించుకుని శుక్రవారం జనగామలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఉన్నపుర, ది అబండెంట్ లైఫ్, ఇమ్మానుయేల్, జియాన్, సెయింట్ పీటర్స్ అండ్ పాల్ చర్చిల్లో ప్రత్యేక ఆరాధన సేవ లు, ఉపవాస దీక్ష కొనసాగించారు. లోక రక్షకుడైన యేసు మానవ సమాజం చేసిన పాపాలను రూపు మాపడం కోసం శిలువ వేయబడి మరణించిన దినంగా పాస్టర్లు బైబిల్‌లోని వాక్యాలను వి వరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరులు పీ ఫిలిప్, జీ నర్సింగరావు, రవికుమార్, మోజెస్, జేమ్స్ పాల్గొన్నారు. రఘునాథపల్లి మండల కేంద్రంతోపాటు కంచనపల్లి, కోమల్ల గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ఫాదర్లు, సంఘకాపరులు అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ప్రత్యేక ప్రార్థనలు చేసి స్వస్థతపర్చారు. ఈ కార్యక్రమంలో కంచనపల్లి చర్చి సంఘ కాపరి రెవరెండ్ మైదం ప్రేమ్‌కుమార్, సంఘం అధ్యక్షుడు దైద ప్రభుదాస్, కార్యదర్శి గడ్డం సందీప్, దైద ఏసుదాస్, పాస్టర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

నిస్సహాయులకు చేయూతనిచ్చిన యేసు

నిస్సహాయులకు చేయూతనివ్వడంతోపాటు శత్రువులపై ప్రేమను చూపించిన యేసు జీవితం మానవాళికి గొప్ప సందేశమని బిషప్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రతాపగిరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ని నిర్మలామాత చర్చి విచారణ గురువు ఫాదర్ అగస్టీన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి నుంచి రిజ్వయర్ వరకు శిలువతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సింగపురం రాజయ్య, సింగపురం నాగన్న, రాజుకుమార్, తాటికొండ మధు, చింత శ్రీను, ఆకారపు అశోక్, మాతంగి దేవయ్య, తాటికొండ యాదగిరి, ఎంపీటీ